సాక్షి అనకాపల్లి
సోమవారం ∣ 1 ∣ ఏప్రిల్ ∣ 2024

జోష్



ధోని.. ధోని..



రిషభ్ పంత్‌ను అభినందిస్తున్న అక్షర్‌పటేల్



షాట్‌కు ప్రయత్నిస్తున్న డీసీ బ్యాటర్ వార్నర్





ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యుల కేరింతలు





వికెట్ తీసిన ఆనందంలో డీసీ ప్లేయర్స్



చీర్ బ్యూటీస్







విశాఖ స్పోర్ట్స్: ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ మ్యాచ్ విశాఖ అభిమానులకు ఫుల్‌జోష్‌ను అందించింది. హోం జట్టుగా బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. ఆదివారం సెలవు దినం కావడంతో నగర క్రికెట్ అభిమానులు వైఎస్సార్ స్టేడియానికి పోటెత్తారు. ఫలితంగా స్టేడియం పూర్తి సామర్థ్యంతో నిండిపోయింది. హోం జట్టుగా బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్యాన్స్‌తో పాటు సీఎస్‌కే అభిమానులు పెద్ద సంఖ్యలో మ్యాచ్‌కు తరలివచ్చారు. ముఖ్యంగా ధోని నినాదంతో స్టేడియం దద్దరిల్లింది. 'కేవలం ధోని కోసమే ఈ మ్యాచ్‌కు వచ్చాను. ఈ రోజు నీవు బ్యాటింగ్ చేయాలి.. ఎందుకంటే నీవు తొలి వన్డే సెంచరీ సాధించింది ఇక్కడే..' అంటూ అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించారు. వారు కోరుకున్నట్టు గానే ధోని చివర్లో బ్యాటింగ్‌కు దిగి.. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో అభిమానుల్లో కావాల్సినంత ఉత్సాహం నింపాడు. డేవిడ్ వార్నర్ అభిమానులు సైతం ఆయన ఫొటోలు ప్రదర్శిస్తూ కేరింతలు కొట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున వార్నర్, రిషబ్ పంత్, పృథ్వీషా 'రన్' రంగం సృష్టించగా.. చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున రహానే, మిచెల్, ధోని అలరించారు. వార్నర్ ఇచ్చిన క్యాచ్‌ను పక్షిలా ఎగురుతూ పతిరన పట్టిన క్యాచ్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. తుదకు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టే పైచేయి సాధించి 20 పరుగుల తేడాతో నెగ్గి గెలుపు బోణీ కొట్టింది.





తగ్గేదేలే..





స్టేడియం బయట కోలాహలం

న్యూస్‌రీల్

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

అనకాపల్లి: జిల్లాలోని మూడు కేంద్రాల్లో సోమవారం నుంచి పదోతరగతి మూల్యాంకనం నిర్వహించనున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూల్యాంకన కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. వేల్పులవీధి టౌన్ గర్ల్స్ హైస్కూల్, గవరపాలెం చిన్న హైస్కూల్, మండలంలో ఏఎంఏఎల్ హైస్కూల్‌లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మూల్యాంకనం జరుగుతుందన్నారు. మూల్యాంకానికి వచ్చే ఉపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలు, ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆమె సూచించారు.

బాల్య వివాహాలు బాధాకరం

తుమ్మపాల: దేశంలో ఇంకా బాల్య వివాహాలు జరుగుతుండడం బాధాకరమని సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ జిల్లా సమన్వయకర్త జి.డేవిడ్ రాజు అన్నారు. ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ ఫండ్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో 20–24 సంవత్సరాల మధ్య 23.3 శాతం మంది 18 ఏళ్లలోపు వయసు గల బాలికలకు వివాహాలు జరిగాయని చెప్పారు. అనంతరం ప్రముఖ రచయిత భువన్ రిభు మాట్లాడుతూ బాల్యవివా హాలను నిరోధించేందుకు చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా సంస్థ ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో బాల్య వివా హాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా మన దేశంలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ ఫండ్ ట్రస్టీ రాజీవ్ భరద్వాజ్ తదితరులు మాట్లాడారు.

రూ.9.95 కోట్ల పన్నులు వసూలు

అనకాపల్లి: వివిధ పన్నుల రూపంలో జోన్ పరిధిలో ఈ ఏడాది రూ.12,19,07,368 వసూలు చేయవలసి ఉండగా ఇప్పటి వరకూ రూ.9,95,53,156 వసూలు చేసినట్టు జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్చి 31వ తేదీ వరకూ వడ్డీ రాయితీతో పన్ను వసూలు చేసినట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో హెడ్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరాజు మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని జి.కోడూరు శివారు జి.నగరం గ్రామానికి చెందిన శ్రీనివాసరాజు అనకాపల్లి డీసీఆర్బీలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల లంకెలపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. స్వగ్రామం జి.నగరంలో ప్రభుత్వ లాంఛనాలతో శ్రీనివాసరాజు మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత



చెట్లను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి

నర్సీపట్నం: అగ్ని ప్రమాదాల నుంచి అడవులను రక్షించుకోవడం అందరి బాధ్యతని అటవీ శాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తెలిపారు. కృష్ణదేవిపేట రేంజ్ పరిధిలో ఆదివారం పర్యటించి, నల్లగొండ గ్రామస్తులతో సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎక్కువగా అటవీ సంపద అగ్నికి ఆహుతవుతోందని, దీంతో అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు ఉపాధి కరవవుతోందన్నారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 1962, 1963లో 20 హెక్టార్లలో వేసిన టేక్ ప్లాంటేషన్లను పరిశీలించారు. ప్లాంటేషన్ కటింగ్‌కు ఆదేశాలిచ్చారు. ఆయన వెంట సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, నర్సీపట్నం, పాడేరు, చింతపల్లి డీఎఫ్‌వోలు జగన్నాథసింగ్, వినోద్‌కుమార్, సూర్యనారాయణ, స్కాడ్ డీఎఫ్‌వో సోమసుందరం ఉన్నారు.

ఏపీఐఐసీ భూముల్లో అక్రమ మైనింగ్

- అడ్డుకున్న అధికారిపై జనసేన నేత దాడి
- పోలీసు కేసు నమోదు



జనసేన నాయకుడి దాడిలో గాయపడ్డ శ్రీనుబాబు



జనసేన నాయకుల ఆధ్వర్యంలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన ప్రాంతం, సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

నక్కపల్లి: విశాఖ– చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలిసి అడ్డుకునేందుకు వెళ్లిన అధికారిపై జనసేన నాయకులతో పాటు, కొంతమంది తవ్వకందారులు దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడిన వారిలో రాజయ్యపేట గ్రామానికిచెందిన జనసేన పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు, ఓ టీవీ చానల్ రిపోర్టర్ పిక్కి కోదండరావు ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో రాజయ్యపేట, చందనాడ, అమలాపురం, వేంపాడు గ్రామాల్లో ప్రభుత్వం 5 వేల ఎకరాలు సేకరించి, రైతులకు నష్టపరిహారం చెల్లించింది. ఈ భూములు ప్రభుత్వం స్వాధీనంలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. అమలాపురం శివారు మూలపర సమీపంలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్టు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు సమాచారం వచ్చింది. ఆయన ఆదేశాల మేరకు అసిస్టెంట్ జోనల్ మేనేజర్ శ్రీను బాబు అడ్డుకునేందుకు మూలపర వెళ్లారు. గ్రావెల్ తవ్వకాల జరుగుతున్న ప్రాంతంలో తవ్విన గ్రావెల్, ట్రాక్టర్లు ఉన్నాయి. అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వడం సరికాదని, తవ్వకాలు నిలిపివేయాలని సూచించారు. అక్రమార్కులు సమాధానం చెప్పలేదు. సమాధానం చెప్పాలని, తవ్వకాలు ఆపాలని మళ్లీ సూచించడంతో తవ్వకందార్లు శ్రీనుబాబుపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. వీరిలో పిక్కి కోదండం అలియాస్ బుజ్జి కాలర్ పట్టుకుని దౌర్జన్యం చేశాడని, ఇక్కడకు రావడానికి ఎంత ధైర్యం అంటూ తనపై దాడి చేశాడని శ్రీను బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు మరికొంతమంది దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధిత అధికారి ఫిర్యాదు మేరకు పిక్కి కోదండరావు, పుణ్యమంతుల సంజీవి, మనబాల గణేష్, రావి రాజు, యలమంచిలి దుర్గాప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్టు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

సీఎం జగన్ మేలు చేస్తే... బాబు అడ్డుకుంటున్నారు

- పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని ఎన్నుకోవాలి
- ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు
- ప్రచారంలో వేలాదిగా పాల్గొన్న అభిమానులు, కార్యకర్తలు



కోలాటాలతో అభ్యర్థులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు




ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ అభ్యర్థి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

నక్కపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు మేలు చేస్తుంటే చంద్రబాబు నాయుడు కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు తెలిపారు. వలంటీర్లను పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని, బాబుకు అధికారం కట్టబెడితే పథకాలన్నీ రద్దు చేస్తారని, జన్మభూమి కమిటీల పెత్తనం పెరుగుతుందని చెప్పారు. మండలంలోని చినదొడ్డిగల్లులో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుతో కలిసి ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడికి ఓటేస్తే మళ్లీ ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా ఎన్నుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్లపాటు నిరాటంకంగా సంక్షేమ పథకాలు అమలు చేసి, రూ.2.80 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ప్రచారంలో నేతలు ప్రసంగిస్తున్న సమయంలో మీ ఖాతాల్లో పథకాల ద్వారా ఎంత జమ అయింది అని ప్రశ్నించగా నాకు రెండు లక్షలు, నాకు నాలుగు లక్షలు, నాకు ఇల్లు, ఇంటి స్థలం అంటూ గ్రామస్తులు పెద్దగా చెప్పడం గమనార్హం. మళ్లీ జగనన్నను సీఎంను చేసుకోడానికి మేం సిద్ధం అంటూ నినాదాలు చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు రాజ్యసభకు ఎన్నికైన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రచారంలో పాల్గొన్నారు. వీరికి రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ఎంపీటీసీ తోట సత్తిబాబు, సర్పంచ్ బొల్లం చంద్రరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తీన్మార్ వాయిద్యాలు, డ్యాన్సులు, కోలాటాలతో జోరుగా ప్రచారం సాగింది. యువకులు, మహిళలు డ్యాన్సులు చేస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. అభ్యర్థులకు అడుగడుగునా హారతులిచ్చారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, ఎంపీటీసీ తోటసత్తిబాబు, సర్పంచ్ చంద్రరావు, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, తాతారావు, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, రెడ్డివరహాలు, సురేష్‌వర్మ, వెదుళ్ల రమణ, నర్సింహమూర్తి, నాగ అప్పలరాజు, వియ్యపు శ్రీను, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, నాయకులు లక్ష్మణరావు, దావీదురాజు, వెలగా రమేష్, పోతంశెట్టిబాబ్జి, చంటిరాజు, ఎస్.రమణ జి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిపై కమలం కన్ను?

- జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతున్న కమల దళం
- కూటమి అభ్యర్థికి కలిసిరాని తెలుగు తమ్ముళ్లు
- ఆశల పల్లకిలో ప్రగడ, బండారు



అచ్యుతాపురం: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందంగా మారింది జిల్లాలోని జనసేన పరిస్థితి. టీడీపీ–జనసేన పొత్తుతో అనుకున్న స్థానాల కంటే చాలా తక్కువకే పరిమితమైన జనసైనికుల చెవిలో మళ్లీ 'కమలం'పువ్వు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బలమైన ఎంపీ అభ్యర్థి అని చెప్తూ వలస నేత సీఎం రమేష్‌ను బరిలో దింపిన టీడీపీ అధినేత కుట్రలు అర్థం కాక ఇప్పటికే జనసేన అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. రమేష్ ఎంపీగా విజయం సాధించాలంటే ఆ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జనసేనను పక్కన పెట్టాలన్నది బీజేపీ ఆలోచన. ఆ పనిలో బీజేపీ నాయకులు ఉన్నారు. ఇప్పటికే ఐవీఆర్ఎస్ సర్వేపై గుర్రుగా ఉన్న జనసేన అభ్యర్థులకు కమలదళం తీరు కంటకంగా మారింది.

సుందరపు సీటుకు ఎసరు?

అనకాపల్లి పార్లమెంటు స్థానాన్ని పొత్తులో భాగంగా పొందిన సీఎం రమేష్ పార్టీ పరంగా బీజేపీ నేత అయినా, తేదేపా అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడని అందరికీ తెలుసు. ఇటీవల జిల్లాకు వచ్చిన రమేష్‌కు ఘన స్వాగతం పలికేందుకు కసరత్తు చేసిన కమల దళానికి యలమంచిలి నుంచి ఆశించిన స్పందన రాలేదు. దీంతో జాతీయ స్థాయిలో పలుకుబడి ఉన్న నడ్డాను ప్రసన్నం చేసుకుని యలమంచిలి సీటు బీజేపీఖాతాలో చేరేలా ఇప్పటికే ప్రయత్నాలు మొదలయ్యాయని తెలిసింది. నడ్డా ద్వారా పవన్‌కల్యాణ్‌ను ఒప్పించేందుకు పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతోందని సమాచారం. మరోవైపు ఈ సీటు తనదేనని, ఐవీఆర్ఎస్ సర్వే సైతం తానే చేయించుకుంటున్నట్లు జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ చెప్పుకుంటున్నారు. అయితే బరిలో నిలిపే అభ్యర్థుల్లో ఎవరు బలమైన వారని తెలుసుకునేందుకు సర్వేలు చేస్తారు తప్ప, అభ్యర్థికి, నోటాకు మధ్య పోటీ ఏంటంటూ జనసైనికులు ముక్కున వేలేసుకుంటున్నారు. టీడీపీ నుంచి ఎంతవరకుమద్దతుఉందో తెలుసుకునేందుకే సర్వే ప్రయత్నం అని జనసైనికులు సర్ది చెప్పుకుంటున్నారు.

బండారుకు పిలుపుతో కలవరం

పెందుర్తి సీటు విషయంలో తీవ్రంగా పోరాడిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. బండారుకు సర్దిచెప్పి ఎన్నికల్లో సహకరించాలని కోరతారా? లేక ఒత్తిళ్ల నేపథ్యంలో పంచకర్ల టిక్కెట్‌ను బండారుకు కేటాయిస్తారా? అన్నది తేలాల్సి ఉంది. రెండోదే జరిగితే పంచకర్ల తదుపరి ఎంపిక యలమంచిలి సీటేనని బహిరంగంగానే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో బండారుకు సీటు వస్తే, తనకూ సీటు రావచ్చన్న ఆశ యలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావులో నెలకొంది. విచిత్రమేమంటంటే సీటు ఖరారైందని జనసేన అధినేత పవన్ పత్రికా ప్రకటన చేసినప్పటికీ ఆ పార్టీ శ్రేణులు మనస్ఫూర్తిగా ప్రచారం చేసుకోలేని దుస్థితి. బీఫాంవచ్చే వరకూ ఎవరిసీటుకీ గ్యారంటీ లేదన్నట్లు కూటమి అభ్యర్థులు మదనపడుతున్నారు. సీఎం రమేష్ అనకాపల్లిలో అడుగుపెట్టక ముందు పరిస్థితి ఒకలా ఉంది. వలసనేత తనబలగంతో వచ్చాక మాడుగులలో జోక్యం, ఇపుడు యలమంచిలి పై కన్ను, పెందుర్తి నుంచిబండారుకు పిలుపు వంటి పరిణామాలతో కూటమి అభ్యర్థులు తలలుపట్టుకుంటున్నారు. చివరికి జనసేన బీ ఫారాలు కూడా బాబు చేతుల్లోనే ఉంటాయని జనసైనికులు, తమ సీట్లు పట్టుకుపోయారంటూ తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఒకరు మండిపడుతున్నారు.

పది 'స్పాట్' రెమ్యునరేషన్ పెంపు

- ఒక్కో పేపర్ దిద్దేందుకు రూ.6.60లు నుంచి రూ.10కు పెంపు
- స్పెషల్ అసిస్టెంట్లకు రూ.137 నుంచి రూ.300
- రెమ్యునరేషన్ పెంపుపై సర్వత్రా హర్షం



మూల్యాంకనంలో అధికారులు, ఉపాధ్యాయులు (ఫైల్)

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, అధికారులకు పెంచిన రెమ్యునరేషన్ చెల్లించేందుకు విద్యాశాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయి. 2016లో నిర్ణయించిన రేట్ల ప్రకారమే స్పాట్ వాల్యూయేషన్ విధుల్లో పాల్గొనే వారికి పారితోషికం చెల్లించేవారు. దీనిపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, నాటి టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్పాట్ వాల్యూయేషన్ రెమ్యునరేషన్ పెంపుపై ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుంది. ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానందరెడ్డి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గతేడాది నుంచి రెమ్యునరేషన్ పెంపు అమల్లోకి వచ్చింది.

రెమ్యునరేషన్ పెంపు ఇలా..

ఒక్కో పేపరు దిద్దేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు గతంలో రూ.6.60లు ఇవ్వగా, దీన్ని రూ.10కు పెంచారు. రోజుకు 40 పేపర్లు వరకు దిద్దేందుకు అవకాశం ఉండటంతో, రూ.400లు పారితోషికం లభించనుంది. క్యాంప్ ఆఫీసర్‌కు రూ.385 నుంచి రూ.578కు,డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.330 నుంచి రూ.495కు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.286ల నుంచి రూ.429, ఎస్ఏలకు రూ.137.50లు నుంచి రూ.300లకు, సీఈలకు రూ.264 నుంచి రూ.396కు,ఎగ్జామినర్‌కు రూ.250లునుంచి రూ.375కు పెంచారు. ఇన్విజిలేషన్ విధుల్లో పాల్గొన్న వారికి కూడా రెమ్యునరేషన్ పెంచారు. జిల్లాలో జవాబు పత్రాల వాల్యుయేషన్‌కు అసిస్టెంట్ ఎగ్జామినర్లు 600 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 320 మంది, చీఫ్ ఎగ్జామినర్లుగా 90 మందికి విధులు కేటాయిస్తూ డీఈవో ఎల్.చంద్రకళ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

వెంకన్నపాలెంలో 100 గ్రాముల బంగారం చోరీ



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ హరి

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెంలో 100 గ్రాముల బంగారం చోరీకి గురైంది. గ్రామానికి చెందిన రెడ్డి శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న సుమారు 100 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు బాధితుడి ఫిర్యాదు మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ హరి, స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వారు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కశింకోట: మండలంలోని కస్నూరుపాలెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. సీఐ ఎం.వినోద్‌బాబు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మాకవరపాలెం మండలం అప్పన్నదొర పాలెంకు చెందిన ఆరపురెడ్డి పవన్ (19) మాకవరపాలెం నుంచి తాళ్లపాలెం వైపు బైక్‌పై వెళ్తూ ఆటోను తప్పించబోయి ఆర్టీసీ బస్సును వెనుకగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు సోదరుడు చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

నవశకం సంక్షేమ సంతకం

యువ న్యాయవాదుల 'నేస్తం'

- నెలకు రూ.5 వేల చొప్పున అందజేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఏడాది రూ.60 వేల చొప్పున మూడేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షల లబ్ధి
- సీఎం జగన్‌తోనే మేలు: జూనియర్ లాయర్ల హర్షం

విశాఖ లీగల్/అల్లిపురం: అప్పుడే చదువులు పూర్తై కోర్టుల్లో అడుగుపెడుతున్న తరుణంలో.. యువ న్యాయవాదులు తమ కాళ్ల మీద నిలబడేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరోసా కల్పించింది. జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ.. వృత్తిలో స్థిరపడేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'వైఎస్సార్ లా నేస్తం' మంచి ఫలితాలనిచ్చింది. 2019 తర్వాత జూనియర్ న్యాయవాదుల సంఖ్య గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా జూనియర్ న్యాయవాదులకు అండగా నిలుస్తానని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ లా నేస్తం పథకం అమలు చేశారు. ఈ పథకం ద్వారా నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు, మూడేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఇలాంటి పథకం కేవలం మన రాష్ట్రంలో మాత్రమే అమల్లో ఉందని యువ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అడ్వకేట్లకు అన్ని రకాలుగా మంచి జరగాలనే ఉద్దేశంతో రూ.100 కోట్లతో అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో వెల్ఫేర్ ట్రస్ట్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

2023లో లా నేస్తం తీసుకున్న యువ న్యాయవాదుల వివరాలివీ..

జిల్లా పేరు	బీసీ	ఓసీ	ఎస్సీ	ఎస్టీ	మొత్తం	లబ్ధి (లక్షల్లో)
అల్లూరి సీతారామరాజు	1	0	5	7	13	రూ.7.80
అనకాపల్లి	45	14	6	1	66	రూ.39.60
విశాఖపట్నం	99	43	23	1	166	రూ.99.60
మొత్తం	145	57	34	9	245	రూ.1.47 (కోట్లు)



లా నేస్తం నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున(ఫైల్)

సీఎం జగన్‌తో న్యాయవాదులకు మేలు



2010కి ముందు జూనియర్ న్యాయవాదులు అధికంగా ఉండేవారు. ఆ తర్వాత క్రమంగా వారి సంఖ్య తగ్గింది. 2019 నాటికి న్యాయవాది వృత్తి అంటేనే భయంతో చాలా మంది దూరమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో జూనియర్ న్యాయవాదులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు రూ.42 కోట్ల వరకు లా నేస్తం కింద నిధులు విడుదల చేసి అండగా నిలిచారు. న్యాయవాద సంక్షేమానికి రూ.100 కోట్లతో వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. గతంలో న్యాయవాదులకు ఏదైనా ప్రమాదం జరిగితే రూ.5 లక్షల వరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ అందించేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచారు. కోవిడ్ సమయంలో న్యాయవాదులను ఆదుకున్న తీరు ప్రశంసనీయం. ఎటువంటి షరతులు లేకుండా రూ.25 కోట్ల రుణ సదుపాయం అందించారు. న్యాయవాదుల బీమా సౌకర్యానికి అవసరమైన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తోంది.

-జీఎం రెడ్డి, అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్

మలుపుతిప్పిన లా నేస్తం



న్యాయవాది కావాలన్నది నా బలమైన కోరిక. ఆర్థిక సహాయం లేకపోవడం వల్ల నాకు వచ్చిన పౌరోహిత్యంతో కాలం గడిపాను. లా చదువుకుని ప్రాక్టీస్ చేయలేని పరిస్థితి ఉండేవాడిని. అలాంటి సమయంలో అమల్లోకి వచ్చిన లా నేస్తం.. నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. లా నేస్తం కింద నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాది రూ.60 వేలను అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. ప్రస్తుతం సీనియర్ల వద్ద వృత్తిలో మెలకువలు నేర్చుకుంటున్నాను. లా నేస్తం వల్ల నా కుటుంబంపై ఆర్థిక భారం తగ్గింది. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– జి.ఆనంద భార్గవ్ శర్మ, జూనియర్ న్యాయవాది

మన రాష్ట్రంలోనే అమల్లో ఉంది



నేను ఇంజినీరింగ్ చేసి న్యాయవాద వృత్తిని చేపట్టాను. 2001 నుంచి నాకు లా నేస్తం అందుతోంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు అందజేస్తోంది. ఈ డబ్బులతో నా వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడంతో పాటు పుస్తకాలు కొనుగోలు చేస్తున్నాను. అమ్మానాన్నల మీద ఆధారపడకుండా ఈ డబ్బులు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రతిరోజూ కోర్టుకు వెళుతూ న్యాయవాది వృత్తిలో రాణిస్తున్నాను. ఈ పథకం కేవలం మన రాష్ట్రంలోనే అమల్లో ఉంది. ఇతర రాష్ట్రాల్లో ఇది ప్రతిపాదనలోనే ఉండగా.. మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ అభినందనీయం. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఎ.సాయి మౌనిక, జూనియర్ న్యాయవాది

మంచి ఆలోచనతో అమలు



జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం ప్రోత్సాహంగా నిలిచింది. ఆర్థికంగానూ, వృత్తి పరంగానూ నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఆలోచనలతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులకు అండగా నిలిచింది లేదు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒకరిద్దరికి మాత్రమే ప్రోత్సాహం అందేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హత గల జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం ద్వారా అండగా నిలిచారు.

– ఎ.కొండాజీ, జూనియర్ న్యాయవాది

జూనియర్లకు పెద్ద గిఫ్ట్



ఇప్పుడిప్పుడే న్యాయవాది వృత్తిని ప్రారంభించిన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు ప్రోత్సాహంగా లా నేస్తం ఇవ్వడం పెద్ద గిఫ్ట్. నేను కొత్తగా న్యాయవాది వృత్తిలోకి ప్రవేశించాను. నాకు ఓ నెల లా నేస్తం వచ్చింది. జూనియర్ న్యాయవాదులకు ఎటువంటి కేసులు ఉండవు. నేర్చుకునే సమయంలో ప్రభుత్వం రూ.5 వేలు ప్రోత్సాహకం అందించడం వల్ల మాలాంటి వారికి చాలా మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– ఎం.వెంకటేష్, జూనియర్ న్యాయవాది

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ జోరు

అనకాపల్లి: గత ప్రభుత్వాల్లో జరగనంత అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగింది కాబట్టే తమకు ఓటేసి గెలిపించాల్సిందిగా ధైర్యంగా ప్రజల్ని అడుగుతున్నామని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన అనకాపల్లిలోని 80వ వార్డు అంబేద్కర్ నగర్, చిన్న బోయిగూడెంవీధి ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి గడప గడపకూ తిరిగారు. విపక్ష కూటముల కుయుక్తులన్నీ ప్రజలకు తెలుసని, వారి మద్దతు వైఎస్సార్ సీపీకేనని ధీమా వ్యక్తం చేశారు. అనకాపల్లి మండలంలోని వేటజంగాలపాలెం గ్రామంలో పార్టీ సీనియర్ నాయకుడు బొట్టా యాకూబ్ ఆధ్వర్యంలో 120 బైక్‌లతో పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు.



చోడవరం పట్టణంలో కళాసీలతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



అంబేద్కర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్, కార్పొరేటర్ నీలిమభాస్కర్

కళాసీలను ఆదుకున్న ఘనత వైఎస్సార్‌సీపీదే

చోడవరం: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరం పట్టణంలో కళాసీల సంఘం వద్ద కళాసీలందరితో ఆదివారం సమావేశమయ్యారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని, కళాసీలకు బీమా ఇతర సదుపాయాలు కల్పించామన్నారు. అలాగే చోడవరం శివారు అన్నవరంలో ఆదివారం రాత్రి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.

ఉద్దపాలెంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి...

అచ్యుతాపురం: మండలంలోని ఉద్దపాలేనికి చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం అచ్యుతాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు,డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ ఆధ్వర్యంలో రాజాన నాగరాజు,అనిమిరెడ్డి రమేష్‌నాయుడు,రెడ్డి రమేష్,రాజాన అప్పలనాయుడు, కారు సంజీవరావు,రాజాన రవి,రాజాన అజయ్,ఎడ్ల హరీష్,అనిమిరెడ్డి దిలీప్‌లు వైఎస్సార్‌సీపీలో చేరారు.

రంగురాళ్ల డాన్ అయ్యన్నపాత్రుడే

- రౌడీయిజం చేయాలనుకుంటే ప్రతిఘటిస్తాం
- వైఎస్సార్‌సీపీ నేతలను బెదిరిస్తే నిన్ను అల్లిపూడి పంపిస్తా
- వలస నేతలకు మద్దతెందుకు
- వలంటీర్ల సేవలను చూసి ఓర్వలేక అడ్డుకున్న చంద్రబాబు
- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నాతవరం: లేటరైట్, రంగురాళ్ల తవ్వకాల ద్వారా కోట్లాది రూపాయలు దోచుకున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి పెద గొలుగొండపేటలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి పదవి అడ్డుపెట్టుకుని నాతవరం మండలంలో లేటరైట్ నిక్షేపాలు గొలుగొండ మండలంలో రంగురాళ్ల ద్వారా కోట్లాది రూపాయలు దోచుకున్న ఘన చరిత్ర మరిచిపోయి పిచ్చి ప్రేలాపనలు చేయడం మానుకోకపోతే అయ్యన్నకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. టిడ్కో ఇళ్ల కాంట్రాక్టరును బెదిరించి రూ.10 కోట్లు కాజేసి ఇల్లు నిర్మాణం చేసుకున్న వ్యక్తి అయ్యన్న ఏ ముఖం పెట్టుకుని ఇపుడు మాట్లాడతారన్నారు. వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలను చూసి జీర్ణించుకోలేక చంద్రబాబు కేంద్ర ఎన్నికల కమిషనర్ ద్వారా అడ్డుకున్నారన్నారు. చంద్రబాబు సభలకు ప్రజలు రాకపోవడంతో జగన్‌మోహన్‌రెడ్డి సభలకు వచ్చే జనాలను చూసి మైండ్ బ్లాక్ అయి అయోమయంలో ఉన్నారన్నారు. అయ్యన్న తనయుడు విజయ్ హద్దు దాటి మాట్లాడితే ఎన్నికల తర్వాత అల్లిపూడికి మూట ముల్లెతో పంపిస్తామన్నారు. తండ్రి తనయులు గ్రామాల్లో ప్రచారానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ నేతలను భయపెడుతున్నారని మీ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరని, ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు. పార్లమెంటు అభ్యర్థిగా స్థానికులను పెట్టాలని ప్రగల్భాలు పలికి ఇపుడు కడప వ్యక్తికి ఎలా మద్దతు పలికావని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 30 వేల మెజార్టీతో తాను విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు వైస్ ఎంపీపీలు పైల సునీల్ మైనం శ్రీనాగగోపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ వీఆర్వోపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

అనకాపల్లి: అక్కిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో వెంకటరమణపేటలో ప్రభుత్వ భూమిలో దుకాణాలు నిర్మించిన అదే గ్రామానికి చెందిన అక్కిరెడ్డి కాసులమ్మ, అక్కిరెడ్డి వెంకట అప్పారావులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి.తేజేశ్వరరావు ఆదివారం చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలివి. ప్రభుత్వ భూమిలో నిర్మించిన దుకాణాలను తొలగిస్తున్న అదే గ్రామానికి చెందిన సచివాలయం వీఆర్వో వి.వినోద్ విధులు నిర్వహిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన కాసులమ్మ, వెంకట అప్పారావు దాడి చేసినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

సీజ్ చేసిన ట్రాలీ విడిభాగాల చోరీ

- ఎన్నికల కోడ్ బిజీలో పోలీసులు
- ఇదే అదనుగా దొంగల హల్‌చల్
- రూ.లక్షల విలువ చేసే సామాన్లు చోరీ
- అనుమానితుని విచారిస్తున్న పోలీసులు



రూ.లక్షల విలువ చేసే డ్రమ్ములతో సహా టైర్లు చోరీకి గురైన దృశ్యం

రావికమతం: అధికారులు సీజ్ చేసి దొండపూడి ఫారెస్ట్ ఠాణా వద్ద రెండేళ్లుగా ఉంచిన గ్రానైట్ లోడ్‌తో ఉన్న హెవీ ట్రాలీలో రూ.లక్షల విలువ చేసే హైకెపాసిటీ బ్యాటరీలు,డ్రమ్ము,రిమ్ముతో సహా టైర్లు, ఇంజిన్ సామాన్లు చోరీకి గురయ్యాయి. కోటపాడుకు చెందిన ఒక దొంగ దొండపూడికి చెందిన మరొక యువకుని సహాయంతో ఇటీవలి కాలంలో చోరీకి పాల్పడ్డారు. దీంతో ట్రాలీ యజమానుల సమాచారంతో రంగంలోకి దిగిన కొత్తకోట పోలీసులు దీనిపై విచారణ చేసి ఒక అనుమానితుని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అజయ్‌పురం గ్రామంలో ఒంగోలుకు చెందిన ఒక వైట్ గ్రానైట్ క్వారీ పరిమితికి మించి అటవీ భూముల్లో తవ్వకాలు జరిపిందని గిరిజన సంఘాలు ఫిర్యాదులు చేయడంతో రెండేళ్ల క్రితం జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వో, మైనింగ్ అధికారులు విచారణ చేసి సదరు క్వారీపై చర్యలు తీసుకున్నారు. అప్పటికే కొత్తకోట వరకూ వచ్చిన లోడ్ ట్రాలీలను స్థానిక ఫారెస్ట్ ఠాణా వద్ద సీజ్ చేసి నిలిపి స్థానిక ఫారెస్టు అధికారులకు అప్పగించారు. ఆ వాహనాలకు అమర్చి ఉన్న విలువైన బ్యాటరీలు ఇటీవల కాలంలో చోరీకి గురయ్యాయి. క్వారీ యజమానులు దానిపై ఫిర్యాదు చేశారు. అది విచారణలో ఉండగా స్థానిక పోలీసులు సైతం ఎన్నికల కోడ్ అమలులో బిజీగా ఉండడంతో దొంగలు ఇదే అదనుగా రూ.లక్షల విలువ చేసే టైర్లు, బ్యాటరీలు, ఇంజిన్ సామాన్లు పక్షం రోజుల వ్యవధిలో ఎత్తుకుపోయారు. దీనిపై కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావును సంప్రదించగా దొండపూడి, కోటపాడు,చోడవరం గ్రామాలకు చెందిన వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్టుగా సమాచారం అందడంతో ఆ దిశగా ఒక యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు.

గుడివాడకు తీరిన రహదారి కష్టాలు

- రూ.కోటి 16 లక్షలతో త్వరిత గతిన పూర్తయిన బీటీ రోడ్డు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



పూర్తయిన రహదారి వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న ఆ గ్రామస్తులు

రావికమతం: గుడివాడ గ్రామ ప్రజల ఏళ్ల నాటి రహదారి కష్టాలు నేటితో తీరి పోయాయి. బురద గుంతలు,జారుడు గట్లుతో ఏళ్ల తరబడి ఆ గ్రామస్తులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. అయితే రూ.కోటి 16 లక్షలతో సుందరమైన తారు రోడ్డు పూర్తి కావడంతో ఆ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమపై అభిమానం చూపి రోడ్డు వేయించిన ధర్మశ్రీకి రుణపడి ఉంటామని అంటున్నారు. మూడు గ్రామాల కేంద్రమైన గుడివాడ గ్రామానికి సరైన రహదారి లేదు. ఆర్ఈసీ రహదారి నుంచి గ్రామానికి సుమారు మూడు కిలో మీటర్ల మట్టి రోడ్డుతో నానా ఇబ్బందులు పడేవారు. వర్షాకాల సమయంలో జారిపడుతూ వెళ్లేవారు. ఏడాది క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ ధర్మశ్రీ ఆ గ్రామం రాగా రహదారి సమస్యను గ్రామస్తులు ఏకరువు పెట్టడంతో బీటీ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రూ.కోటి 16 లక్షలు మంజూరు చేయించడమే కాక ఎప్పటికపుడు పనులు పర్యవేక్షిస్తుండడంతో గ్రామానికి చక్కని తారురోడ్డు ఏర్పాటైంది. హామీ ఇవ్వడమే కాక ప్రత్యే క శ్రద్ధ చూపి రోడ్డు పనులు పూర్తి చేయించిన తమ నాయకునికి రుణపడి ఉంటామని సంతోషంగా చెబుతున్నారు.

వృద్ధులను ఇబ్బంది పెట్టడం దుర్మార్గం



మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి అనురాధ

దేవరాపల్లి : వలంటీర్లను పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకోవడం ద్వారా వృద్ధులు, వికలాంగుల నోటి కాడ కూడు తీసేసే దుర్మార్గం తగదని మాడుగుల వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. నిమ్మగడ్డ రమేష్ ద్వారా చంద్రబాబు ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాయించి వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయకుండా నిలిపివేయించడంపై ఆమె ఘాటుగా స్పందించారు. తారువలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేస్తున్న వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, దత్తపుత్రుడు, పచ్చ మీడియా నీచ రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు. స్వచ్ఛంద సంస్థ ముసుగులో నిమ్మగడ్డ రమేష్ చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చడమే ధ్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. వలంటీర్లపై కక్షపూరితంగా వ్యవహరించడంపై రాష్ట్ర ప్రజలు ఛీకొడుతున్నారని అన్నారు. చంద్రబాబుకు వృద్ధులు, వికలాంగుల ఉసురు కచ్చితంగా తగులుతుందన్నారు. ఇప్పటికైనా ఈసీ తన నిర్ణయాన్ని పునరాలోచించాలన్నారు.

సీడీసీ చైర్మన్ సుంకరకు సతీ వియోగం



జ్యోతి భౌతికకాయం వద్ద నివాళలర్పిస్తున్న డిప్యూటీ సీఎం



మృతురాలు సుంకర జ్యోతి (ఫైల్)

చీడికాడ: చోడవరం సుగర్స్ సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు భార్య జ్యోతి(48)గుండెపోటుతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. దీంతో మండలంలోని ఆయన స్వగ్రామం ఖండివరంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఖండవరం గ్రామంలో శనివారం రాత్రి జ్యోతి గుండెపోటుకు గురికాగా హుటాహుటిన చోడవరం ఆస్పత్రికి తీసుకుని రాగా మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తుది శ్వాస విడిచింది. శ్రీనివాసరావు ఇటీవలే సీడీసీ చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉంటే ఏడాదిన్నర క్రితం శ్రీనివాసరావు కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ దుఃఖం నుంచి బయట పడక ముందే భార్య మృతి చెందడంతో శ్రీనివాసరావును ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఈ విషయం తెలిసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హుటాహుటిన ఆదివారం సాయంత్రం ఖండివరం వచ్చి జ్యోతి భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి శ్రీనివాసరావును ఓదార్చారు. అలాగే టీడీపీ నేత గవిరెడ్డి రామానాయుడు కూడా జ్యోతి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే కన్నబాబు రాజు



మధ్యాహ్నం అదే వ్యక్తి వైఎస్సార్‌సీపీలోకి చేరడంతో పార్టీ కండువా కప్పిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

అచ్యుతాపురం: మండలంలో వైఎస్సార్‌సీపీలో చేరికల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఇటీవల చోడపల్లికి చెందిన పలువురు ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకోగా, ఆదివారం అచ్యుతాపురం సెజ్‌కాలనీ పిట్లపాలేనికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి చేరారు. అచ్యుతాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వీరందరికీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. యాత శెట్టి బలిజ సంఘం అచ్యుతాపురం మండల కన్వీనర్ పిల్లి వెంకట రమణ, 4వ వార్డు మెంబర్ పోలారపు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ సమక్షంలో పలువురు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలోకి చేరిన వారిలో పోలారపు సత్యనారాయణ, అప్పలరాజు, సత్తిబాబు, పిల్లి కొండలరావు, పుష్పరాజు, కె.తాతబాబు, పోసెట్టి సన్యాసిరావు, మనసా అప్పలరాజు, మరిసా నాగరాజు ఉన్నారు. దీంతో సెజ్ కాలనీల్లో వైఎస్సార్ సీపీ బలం రోజురోజుకీ పెరుగుతోంది.

కొండపాలెంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి

రోలుగుంట: కొండపాలెం గ్రామానికి చెందిన రెండు టీడీపీ కుటుంబాలు ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిలో టీడీపీకి చెందిన కార్యకర్త అయిన పాము చిరంజీవి అనే సొంత పార్టీ వ్యక్తికి పార్టీలో చేరినట్టు ఆదివారం ఉదయం మండల ప్రచారానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పార్టీలో చేరుతున్నట్టు కండువా వేశారు. అయితే అదే వ్యక్తి రోలుగుంట వచ్చిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో స్వచ్ఛందంగా చేరారు. ఇదే గ్రామం నుంచి పాము నూకరాజు కూడా పార్టీలో చేరడంతో అతనికి కూడా ధర్మశ్రీ పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాల అమలు, ధర్మశ్రీ నాయకత్వానికి ఆకర్షితులమై పార్టీలో చేరామని, గ్రామ మాజీ సర్పంచ్ బంటు సూర్యసన్యాసిదేముళ్లు, గ్రామ పార్టీ నాయకులతో కలసి పార్టీ గెలుపునకు శక్తివంచన లేకుండా పని చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న కేకేవీఏ నారాయణరావు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు యువత ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపకుడు, వైద్యుడు కేకేవీఏ నారాయణరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి కల్యాణి నర్సింగ్ హోమ్ మేడపైన ఆదివారం ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిసెట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 25 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కర్రి సన్యాసిరావు, యల్లపు శ్రీరాములు, కర్రి త్రినాథ్, సేనాపతి మునసబునాయుడు, ఆడారి శివాజీ, బొడ్డేడ కాశి తదితరులు పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే పింఛన్లకు ఆటంకం'

అనకాపల్లి : కూటమి ఓటమి భయంతోనే ప్రతీ నెల ఒకటో తేదీన తెల్లవారక ముందే అవ్వా తాతలకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్ అందకుండా కుట్రలు పన్నిందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. పింఛన్లు అందించకుండా వలంటీర్లను అడ్డుకున్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను ఓడించి, బదులు తీర్చుకోవాలని లబ్ధిదారులను కోరారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తొత్తులు హైకోర్టులో పిటిషన్లు వేసి, ఢిల్లీలో ఈసీకి ఫిర్యాదు చేసి పింఛన్ లబ్ధిదారుల్ని బాధపెట్టడం ఆక్షేపణీయమన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా అందే పింఛన్ కోసం ఆశగా ఎదురుచూసే అవ్వ, తాతలు, వికలాంగులు, వితంతువులను ఇబ్బంది పెట్టి, నీచ రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో కూటమికి బుద్ధి చెప్పే రోజులు ఆసన్నమయ్యాయన్నారు.

ధ్యాన వేంకటేశునికి ప్రత్యేక పూజలు


పూలమాలల అలంకరణలో ధ్యాన వేంకటేశుడు

కశింకోట: స్థానిక వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరంలో ఫాల్గుణ మాసం పురస్కరించుకుని ఆదివారం స్వామిని పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు.

అనకాపల్లి సినిమాలు

గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	:	సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	:	సత్యనారాయణస్క్రీన్-2
ఓం భీం బుష్	:	షిర్డిసాయి
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	:	పర్తిసాయి
ది గోట్ లైఫ్	:	వెంకటేశ్వర
కలియుగ పట్టణంలో	:	శ్రీసత్య
టిల్లు స్క్వేర్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 211 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 163 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



- సుమారు రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- ప్రస్తుత ప్రభుత్వంలో అందుబాటులో అన్ని వసతులు

తీరు మారిన 'తీడ'

మండలానికి మారుమూలన ఉన్న గ్రామ పంచాయతీ తీడ. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ చూడనంత అభివృద్ధికి నోచుకుంది. తొలి రెండేళ్లు కరోనాతో గడిచిపోతే చివరి మూడేళ్లలోనే రూ.కోట్ల నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ప్రాధాన్యతా భవనాలు.. ఇలా గ్రామానికి అవసరమైన ప్రతి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సీఎం జగన్ పాలనలో సంక్షేమానికి మించి అభివృద్ధి జరిగిందని తీడ ప్రజలు ఆనందంగా చెప్పున్నారు.


జగనన్న కాలనీ భారీ లేఅవుట్‌లో చురుగ్గా జరుగుతున్న గృహ నిర్మాణాలు


తీడ శివారు మేడిశెట్టి వానిపాలెం గ్రామానికి నిర్మించిన రోడ్డు

కశింకోట: మండలంలోని తీడ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. సీఎం జగన్ పాలనలో ఈ గ్రామం ప్రతి అంశంలోనూ అభివృద్ధికి నోచుకుంది. గ్రామానికి చెందిన నిరుపేదల సొంతింటి కల నెరవేరింది. జగనన్న కాలనీల్లో భాగంగా వేసిన భారీ లే అవుట్లో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ చర్యలతో తీడ గ్రామ స్వరూపం మారి, నూతనత్వం సంతరించుకుంటోంది.

అందుబాటులో అన్ని వసతులు

తీడ పంచాయతీలో 2400 మంది జనాభా ఉన్నారు. మేడిశెట్టివానిపాలెం, కచ్చళ్లపాలెం, రెడ్డివానిపాలెం, పాత కన్నూరుపాలెంలో కొంత భాగం శివారు గ్రామాలుగా ఉన్నాయి.


డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు పరిశ్రమ సహకారంతో నిర్మించిన సామాజిక భవనం

- సచివాలయానికి సొంత భవనాన్ని రూ.42 లక్షలతో నిర్మిస్తున్నారు. శ్లాబ్ వేశారు. నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- గ్రామీణ ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసం రూ.21 లక్షలతో వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించారు. ఇపుడు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా.. గ్రామం దాటి వెళ్లాల్సిన పనిలేదు.
- నాడు-నేడు నిధులు రూ.26 లక్షలతో ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించి, అందంగా తీర్చిదిద్దారు.
- ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు, మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. రూ.2 లక్షలతో డ్రైనేజీ నిర్మించారు.
- పోతురాజుబాబు మాన్యాన్ని ఉపాధి హామీ పథకంలో రూ.26 లక్షలు వెచ్చించి చదును చేశారు.
- గ్రామంలో డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రై.లి. సహకారంతో సామాజిక భవనాన్ని నిర్మించారు. గ్రామస్తుల అవసరాల మేరకు సభలు, సమావేశాలు, శుభకార్యాలకు వీలుగా దీన్ని ఏర్పాటు చేశారు.


తీడలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్

- మేడిశెట్టివానిపాలెం గ్రామానికి రూ.26 లక్షలు, మరో శివారు గ్రామం కచ్చళ్లపాలేనికి రూ.6 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్లు నిర్మించారు. దీంతో ప్రజలు రాకపోకలకు సౌకర్యవంతంగా మారింది.
- పాత కన్నూరుపాలెం రామాలయం వద్ద గ్రామస్తుల అవసరాల మేరకు రూ.6 లక్షలతో ప్లాట్‌ఫారం నిర్మించారు.
- నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గ్రామ సమీపంలో వంద మందికి స్థలాలు, ఇళ్లను ప్రభుత్వం సమకూర్చింది. ఇందులో సగం మంది ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశాలు కూడా చేశారు.

జగనన్న ప్రభుత్వంలో సొంతిల్లు



నా భర్త సన్యాసినాయుడు కూలీ. ఓ కొడుకు, కూతురు ఉన్నారు. నా భర్తకు వచ్చే అరకొర ఆదాయంతోనే ఇల్లు గడిచేది. దాదాపు 20 ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే ఉండేవాళ్లం. నెలకు రూ.3 వేలు అద్దెకే వెళ్లిపోయేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక లేఅవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు సాయం చేశారు. దీంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర మార్గాల్లో సమకూర్చుకున్న డబ్బులతో మా కలల ఇంటిని నిర్మించుకున్నాం. ఇపుడు అందులోనే ఉంటున్నాం. ఈ ప్రభుత్వం చేసిన సాయాన్ని మా కుటుంబం ఎప్పటికీ మర్చిపోదు.

– మేడిశెట్టి రాజు, తీడ

వెల్‌నెస్ సెంటర్‌లో మెరుగైన వైద్యం



వయసు మీదికొచ్చిన బతుకు నాది. గతంలో ఏ చిన్న అనారోగ్యం వచ్చినా శ్రమకోర్చి కన్నూరుపాలెం వెళ్లాల్సి వచ్చేది. కొన్నిసార్లు అక్కడ డాక్టర్లు ఉండేవారు కాదు. అక్కడున్న నర్సులు ఇచ్చిన మందు బిళ్లలు తీసుకుని వచ్చేసేవాన్ని. జగన్‌బాబు ప్రభుత్వంలో మా ఊర్లోనే ఆస్పత్రి(వెల్‌నెస్ సెంటర్) బిల్డింగ్ కట్టారు. ఉదయం, సాయంత్రం డాక్టరు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. అవసరమైన రక్తపరీక్షలు చేస్తున్నారు. ఉచితంగానే అన్ని మందులూ ఇస్తున్నారు. ఇపుడు కన్నూరుపాలెం వెళ్లే ఇబ్బంది తప్పింది. మాలాంటి ముసలోళ్లకు ఇంతకంటే ఏం కావాలి.

– తమరాన రామునాయుడు, తీడ

పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి

వెల్‌నెస్ సెంటర్	రూ.21 లక్షలు
ఎస్సీ కాలనీలో మౌలిక వసతులు	రూ.12 లక్షలు
నాడు-నేడులో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి	రూ.26 లక్షలు
సచివాలయ భవనం	రూ.42 లక్షలు
పోతురాజుబాబు మాన్యం చదును	రూ.26 లక్షలు
శివారు మేడిశెట్టివానిపాలేనికి సీసీ రోడ్డు	రూ.26 లక్షలు
శివారు కచ్చళ్లపాలేనికి సీసీ రోడ్డు	రూ.6 లక్షలు
పాత కన్నూరుపాలెంలో సీసీ ప్లాట్‌ఫాం	రూ.6 లక్షలు
సామాజిక భవనం(డెక్కన్ ఫైన్ కెమికల్స్ నిధులు)	రూ.26 లక్షలు

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం


కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


బాలభాస్కర్‌శర్మకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానం వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీకాకుళం శ్రీచక్ర శ్రీరాజరాజేశ్వరీదేవి ఆశ్రమ పీఠాధిపతి బాల భాస్కర్‌శర్మ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో శర్మకు స్వాగతం పలికారు. ఆలయ మండపంలో 500 మంది మహిళలు శ్రీచక్రాలకు కుంకుమ పూజలు జరిపారు. లలితా సహస్రనామ, ఖడ్గమాల సూత్ర పారాయణాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం కమిటీ సభ్యులు బాలభాస్కర్ శర్మకు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఫొటోను అందించి, గౌరవ సత్కారం చేశారు. కార్యక్రమంలో శత జయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు కొడుగంటి


గోవిందరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సీపీఐ నాయకులు

అనకాపల్లి : స్వాతంత్ర సమర యోధుడు, సీపీఐ మాజీ శాసన సభ్యుడు స్వర్గీయ కొడుగంటి గోవిందరావు 101వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక నెహ్రూచౌక్‌లో గోవిందరావు విగ్రహానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రాజకీయ నాయకులు గోవిందరావు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనకాపల్లి నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు శాసన సభ్యుడిగా గెలుపొందినట్లు తెలిపారు. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు నినాదంతో జరిగే పోరాటంలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పోరాటాలు చేసిన చిరస్మరణీయుడని కొనిడారు. కూటమి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఓట్లు కోసం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మాయమాటలు, కట్టుకథలు చెప్తున్నారని ఎద్దేవా చేశబూరు. కేంద్రం ఆడుతున్న నాటకంలో పాత్రధారి రమేష్ అని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాజీ కౌన్సిలర్ తాకాశి వెంకటేశ్వరరావు, కోరిబిల్లి శంకర్‌రావు, నరాలశెట్టి సత్యనారాయణ, విత్తనాల పోతురాజు, వీరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి చిత్తశుద్ధితో కృషి

- బూత్ కమిటీలు, పార్టీ శ్రేణులతో మళ్ల బుల్లిబాబు


బూత్ కమిటీలు, కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల బుల్లిబాబు

కశింకోట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని జమాదులపాలెం, రామన్నపాలెం, విసన్నపేట గ్రామాల్లో ఆదివారం రాత్రి పార్టీ శ్రేణులతో, కశింకోట, వెదురుపర్తి గ్రామాల్లో పోలింగ్ బూత్ కమిటీలు, కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ దాదాపు నెరవేర్చిన ఘనత దక్కించుకున్నారన్నారు. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావడానికి ప్రతి ఒక్కరూ దోహదపడాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఘన విజయం చేకూరేందుకు దోహదపడాలన్నారు. సమావేశాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, పార్టీ నాయకుడు ఉప్పనూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

సబ్బవరం: మండలంలోని 68 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోల ఆధ్వర్యంలో ఆదివారం మన పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఓటర్లు తమ పేర్లు జాబితాలో సరిచూసుకున్నారు. సబ్బవరం పోలింగ్ స్టేషన్లు 34,36,37లను సెక్టార్ అధికారులు పి.విజయలక్ష్మి, హిమబిందు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి

- ప్రజలను ఓటడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్


అంబేడ్కర్ నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్


వెంకుపాలెంలో ఎన్నికల ప్రచార బైక్ ర్యాలీలో పాల్గొన్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: తమ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమాన్ని వివరించి ఓట్లు అడిగే హక్కు కేవలం వైఎస్సార్‌సీపీకే ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక 80వ వార్డు అంబేడ్కర్‌నగర్, చిన్నబోయిగూడెం వీధిలో కార్పొరేటర్ కొణతాల నీలిమభాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలన్నింటినీ గ్రామాల్లోనే అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి 40 ఏళ్ల రాజకీయ అనుభవముందని చెప్పుకునే చంద్రబాబు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే సత్తాలేక, బీజేపీ, జనసేనతో పొత్తులు పెట్టుకున్నారని ఎద్దేవా చేశబూరు. ఎంత మందితో కూటమి కట్టినా రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సీఎం జగనన్న పాలనలో పేదల సొంతింటి కల నెరవేరిందన్నారు. నియోజకవర్గంలో సుమారు 10 వేల మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి యోగం దక్కిందన్నారు. తమ ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాల్లో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నబోయిగూడెం రామాలయంలో రాములవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో భరత్‌కుమార్ వెంట ఆయన సతీమణి నివేదిత, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు డీవీ నర్సింగరావు, కె.వెంకటరావు, జి.గణేష్, లోకేష్, కె.ఎం.నాయుడు, విల్లూరి శివసూరి, కర్రి రుద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

- 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక భీముని గుమ్మంలో మలసాల భరత్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆరోగ్యం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గొల్లవీధి యూపీహెచ్‌సీకి నూతన భవనాన్ని నిర్మించి, మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. కోట్లాది రూపాయల సంక్షేమ పథకాలను అందుకున్న స్థానికులు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను డీబీటీ పద్ధతిలో ఎక్కడా పైసా అవినీతి జరగకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిన ఘనత మన అందరి జగనన్న ప్రభుత్వానిదని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు-1 ఉగ్గిన అప్పారావు, కటారి దేముడు, అనూరాధ, సంపగి కనకారావు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.
- సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని వేటజంగాలపాలెంలో పార్టీ సీనియర్ నాయకుడు బొట్టా యాకూబ్ ఆధ్వర్యంలో 120 బైక్‌లతో పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేసి, పార్టీకి ఘన విజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, గ్రామ నాయకులు పడాల ఈశ్వరరావు, గుమ్మల శ్రీను, సాలాపు శంకరశ్రీను, పడాల గంగరాజు, బొద్దపు సోమేష్ పాల్గొన్నారు.


గోపాలపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న భరత్‌కుమార్ భార్య నివేదిత

- మండలంలోని గోపాలపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత, ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మరో సారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు.


భీమునిగుమ్మంవీధిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


చిన్నబోయిగూడెంవీధి రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

బూడికి అభినందనలు


బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న మండల సముద్రం తదితరులు

సబ్బవరం: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును సబ్బవరం మేజర్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ఆయనను ప్రకటించడంతో తారువలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. సబ్బవరం మాజీ సర్పంచ్ మండల సముద్రం, అనకాపల్లి మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ గొంప దేముడు తదితరులు ఆయన్ను సత్కరించి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. అలాగే మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధకు కూడా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పార్టీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శి దెడ్డం పద్మావతి, పార్టీ సీనియర్ నాయకులు టి. శేఖర్, సబ్బవరపు నాగభూషణం, ధనిమిరెడ్డి శ్రీను, కేశవరావు పాల్గొన్నారు.